సాక్షి సంగారెడ్డి

బుధవారం, 7, మే, 2025



ఫలితాల్లో రోల్ మోడల్

టేక్మాల్ మోడల్ స్కూల్ విద్యార్థులు విద్యాబోధనలో మెళకువలు పాటిస్తూ.. ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

వివరాలు 8లో ▸



బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

ఐపీఎల్ బెట్టింగ్ ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వివరాలు 8లో ▸



పరిశ్రమలో అగ్నిప్రమాదం

బొల్లారం పారిశ్రామికవాడలోని మైలాన్ పరిశ్రమలో మంగళవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించాలి

జహీరాబాద్ టౌన్: దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు కొనింటి నర్సింలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో శారీరక దివ్యాంగుల రోస్టర్‌ను మార్చాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రత్యేకంగా దివ్యాంగులకు కార్పొరేషన్ ఏర్పాటుతోపాటు, ప్రత్యేక విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తీవ్ర వైకల్యం కల్గిన వారికి రూ.25 వేల ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న హైదరాబాద్‌లోని వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వెల్లడించారు.

'రైల్వేను ప్రైవేటీకరించొద్దు'



జహీరాబాద్ రైల్వే స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

జహీరాబాద్ టౌన్: రైల్వే ప్రైవేటీకరణ ఆపాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఐటీయూ నాయకులు మంగళవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ...కేంద్రంలోని మోదీ సర్కార్ ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా ప్రైవేటీకరిస్తోందన్నారు. ప్రయాణికుల భద్రతను గాలికి వదిలేసి రైల్వేను కూడా ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. రైల్వే స్టేషన్లలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. జహీరాబాద్ స్టేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బక్కన్న, లక్ష్మణ్, గుండప్ప, మొగులయ్యలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా

సంగారెడ్డి జోన్: గ్రామాలలో వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి పంచాయతీ కార్యదర్శులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఎక్కడా నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎక్కడైనా బోరు బావుల మోటార్లు చెడిపోయినా, పైప్ లీక్ అయినా వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం



మాట్లాడుతున్న రాంచందర్

జహీరాబాద్ టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాంచందర్ ఆరోపించారు. పట్టణంలోని శ్రామిక్ భవనంలో మంగళవారం నిర్వహించిన కార్మిక సంఘం సమావేశంలో రాంచందర్ పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని పటిష్టపరిచేందుకు రూ.2 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. రోజు కూలీ రూ.600 ఇవ్వాలని, రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించాలని, సంవత్సరంలో 200 పని దినాలు కల్పించాలన్నారు. కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలని కోరారు. డిమాండ్‌ల సాధన కోసం ఈ నెల 20 జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సంఘం నాయకులు తుల్జారాం, సంజీవ్ కుమార్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

జిన్నారం (పటాన్‌చెరు): బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని రాష్ట్ర కార్మిక నాయకులు వరప్రసాద్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలకు కార్పొరేట్ శక్తులకు అప్పగించే మోదీ సర్కార్ కుట్రలను తిప్పి కొట్టాలని మే 20 నిర్వహించే దేశవ్యాప్త జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బొల్లారంలో అఖిలపక్ష నాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక రైతాంగ హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. కార్మిక చట్టాలు కోడ్‌లను ఉల్లంఘించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కొల్కూరి నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సీఐటీయూ కార్యవర్గ సభ్యుడు రాజయ్య, స్థానిక కార్మిక నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

యువ వికాసానికి సిబిల్ గ్రహణం!



రుణాల మంజూరులో తెరపైకి సిబిల్ స్కోర్

- మానవీయ కోణంలో రుణాలివ్వాలంటున్న అధికారులు
- మార్గదర్శకాలు పాటిస్తాం: బ్యాంకర్లు
- డీసీసీ సమావేశంలో చర్చ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రాజీవ్ యువ వికాసం పథకం అమలులో సిబిల్ స్కోర్ అంశం తెరపైకి వస్తోంది. ఈ పథకం కింద ఇచ్చే రుణాల మంజూరు విషయంలో లబ్ధిదారుల సిబిల్ స్కోర్‌ను పరిగణలోకి తీసుకుంటే చాలామంది దరఖాస్తుదారులకు ఈ పథకం యూనిట్లు మంజూరయ్యే అవకాశాలు ఉండటం లేదు. ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారంతా నిరుపేదలే. దీంతో బ్యాంకులు సిబిల్ స్కోర్ కారణంగా ఈ రుణాలు దక్కక ఈ పథకం ద్వారా లబ్ధిపొందడం ప్రశ్నార్థకంగా మారనుంది. ఈ రుణాల మంజూరులో బ్యాంకర్లు మానవీయ కోణంలో వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు.

కొనసాగుతున్న పరిశీలన ప్రక్రియ

ఈ పథకం కోసం జిల్లాలోని యువత నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చిన విషయం తెలిసిందే. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ కేటగిరీల కింద మొత్తం 49,559 దరఖాస్తులు వచ్చాయి. ఎంపీడీఓలు ఆయా మండలాల స్థాయిలో దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పరిశీలించి అర్హులైన వారి దరఖాస్తులను సంబంధిత బ్యాంకులకు ఫార్వర్డ్ చేస్తారు. ఇలా ఆయా బ్యాంకులకు వచ్చిన దరఖాస్తుదారులకు బ్యాంకులు రుణాలు ఇవ్వాల్సి ఉంటుంది. రుణం మంజూరులో సిబిల్ స్కోర్ కీలకంగా మారుతుంది.

ఆ యూనిట్లకు బ్యాంకు రుణాలు...

ఈ పథకం కింద రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వ్యయం ఉన్న యూనిట్లకు బ్యాంకులు 30% మొత్తాన్ని రుణంగా ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వ్యయం ఉన్న యూనిట్లకు రూ.20 శాతం మొత్తాన్ని, రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు యూనిట్ కాస్ట్ ఉన్న లబ్ధిదారులకు బ్యాంకులు పది శాతం రుణం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ రుణం ఇవ్వాలంటే సిబిల్ స్కోర్ పాటించడం తప్పనిసరని బ్యాంకు మేనేజర్లు పేర్కొంటున్నారు.

ప్రత్యేక డీసీసీ సమావేశంలో చర్చ

ఈ పథకాన్ని త్వరితగతిన అమలు చేసేందుకు ఇటీవల జిల్లా కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ) సమావేశాన్ని ఇటీవల నిర్వహించారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లాలో ఉన్న అన్ని బ్యాంకుల ప్రతినిధులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీ కార్పొరేషన్‌లకు సంబంధించిన అధికారులు హాజరయ్యారు. లబ్ధిదారులకు వీలైనంత త్వరగా రుణాలు మంజూరు చేయాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా ఈ సిబిల్ స్కోర్ అంశంపై ప్రత్యేకంగా చర్చ జరిగింది.

మానవీయ కోణంలో రుణాలివ్వాలి

రాజీవ్‌యువ వికాసం పథకం కింద ఇచ్చే రుణాల విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాలని బ్యాంకర్లకు చెబుతున్నాము. ఈ పథకం కింద రుణాలు పొందే వారంతా నిరుపేదలే ఉంటారు. వారికి చేయూతనందిస్తే వారు స్వయం ఉపాధి పొందేందుకు వీలు కలుగుతుంది. ప్రస్తుతం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది.

-రామాచారి, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ

ఎస్ఎల్‌బీసీ లేఖ రాస్తాం

వివిధ రకాల రుణ మంజూరులో బ్యాంకులు తప్పనిసరిగా రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా గైడ్‌లైన్స్ పాటించాల్సి ఉంటుంది. రాజీవ్ యువ వికాసం పథకం కింద ఇచ్చే రుణాలకు సంబంధించి సిబిల్ స్కోర్‌ను పరిగణలోకి తీసుకోవద్దనే గైడ్‌లైన్స్ ఏమీ మాకు రాలేదు. ఈ విషయంలో ఎస్ఎల్‌బీసీకి రాసి స్పష్టత తీసుకుంటాము.

-బి.నర్సింగ్‌రావు, లీడ్ బ్యాంక్ మేనేజర్, సంగారెడ్డి

ఎరువుల వినియోగం తగ్గించాలి

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం



సదస్సులో మాట్లాడుతున్న రాములు నాయక్

జిన్నారం (పటాన్‌చెరు): యూరియా వాడకం తగ్గించడం వల్ల సాగు ఖర్చు తగ్గించుకోవచ్చని అలాగే రసాయనాలు, ఎరువులను తగ్గించడం వల్ల నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త సుమాలిని, కాంగ్రెస్ నేత రాములు నాయక్ పేర్కొన్నారు. గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు సలహాలను అందించారు. విత్తినప్పటి నుంచి పంట కోసే వరకు విత్తనాలకు సంబంధించి రశీదులు భద్రపరుచుకోవాలని సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి మేలైన వంగడాల గురించి వివరించారు. నత్తనయ్యపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శోభా మాట్లాడుతూ... చిరుధాన్యాలు సాగు చేయడం ద్వారా మన ఆరోగ్యాన్ని పెంపొందించవచ్చన్నారు. సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పచ్చిరొట్టె ఎరువుల పంటలైన జనుము, జీలుగ ఆవశ్యకతను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ దయాకర్‌రెడ్డి, డైరెక్టర్ జయశంకర్ గౌడ్, దయాకర్ రెడ్డి, వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నల్లవల్లిలో....

గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు హేమలత జానకి ముఖ్య అతిథులుగా పాల్గొని రైతులకు పంటల సాగు పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రణవి, వ్యవసాయ విద్యార్థులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీలోని కొత్తపల్లి, కానుకుంట ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్డీఏ డీపీఎం జయశ్రీ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు రికార్డులను పరిశీలించారు. కేంద్రాల వద్ద జరుగుతున్న కొనుగోళ్లను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ...సకాలంలో ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కొత్తపల్లిలో 26 మంది రైతులు, 2,460లకుపైగా బస్తాలు, 984.80 క్వింటాళ్ల ధాన్యం నమోదు కాగా కానుకుంటలో 24 మంది రైతులు, 2,016 బస్తాలు, 842.80 క్వింటాళ్ల కొనుగోలు చేశారని తెలిపారు. కేంద్రం వద్ద రైతులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.



తనిఖీ చేస్తున్న జయశ్రీ

తహసీల్దార్ కార్యాలయానికి తాళం

అద్దె చెల్లించడం లేదని యజమాని ఆగ్రహం



తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసిన యజమాని, నిల్చున్న తహసీల్దార్, కార్యాలయ సిబ్బంది

కల్హేర్(నారాయణఖేడ్): అద్దె డబ్బులు చెల్లించడం లేదని సదరు భవన యజమాని తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేశారు. సిర్గాపూర్ మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఘటన జరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిర్గాపూర్ మండలంగా ఏర్పాటు చేయగా అప్పట్లో అధికారులు ప్రైవేట్ భవనంలో తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్వహించారు. అదే భవనంలో దాదాపు ఎనిమిదేళ్ల నుంచి తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతున్నా ప్రభుత్వం మాత్రం అద్దె డబ్బులు చెల్లించడం లేదు. దాదాపు 2 ఏళ్ల నుంచి రూ. 5 లక్షల వరకు అద్దె డబ్బులు చెల్లించాలి. దీంతో భవన యజమాని నర్సమ్మ అద్దె డబ్బులు చెల్లించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదు. ఈ క్రమంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లిన నర్సమ్మ అధికారులను బయటికి పంపించి తాళం వేసింది. సాయంత్రం కార్యాలయం పని వేళలు ముగిశాయని చెబుతూ తహసీల్దార్ నజీంఖాన్, సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు. తాళం వేసిన విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని నజీంఖాన్ తెలిపారు. గతంలోనూ అద్దె డబ్బులు చెల్లించడంలేదని తాళం వేసిన ఘటన జరిగింది. తహసీల్దార్ కార్యాలయానికి తరుచుగా తాళం వేయడంతో మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్లోకి నకిలీ విత్తు

- గుట్టుగా బీటీ-3 పత్తి విత్తన విక్రయాలు!
- పొరుగు రాష్ట్రాల నుంచి సరుకు

గజ్వేల్: జిల్లాలో ఏటా వానాకాలంలో 5.50లక్షల ఎకరాల్లో పంటలు సాగులోకి వస్తుంటాయి. ఇందులో వరి 3.50లక్షల ఎకరాలకుపైగా సాగులోకి వస్తుండగా మరో 1.50లక్షల సాగుతో పత్తి రెండో స్థానాన్ని ఆక్రమిస్తోంది. కాలం కలిసొస్తే...'తెల్ల'బంగారం'గా చెప్పుకునే పత్తి పంటతో జిల్లా రైతులకు విడదీయరాని బంధం ఉంది. కానీ ఏటా ఈ పంట సాగులో నకిలీ విత్తన మకిలీ కలవరపరుస్తోంది. ఇతర పంటలతో పోలిస్తే...బెట్టకు తట్టుకుందని, కష్ట కాలంలో తమను ఆదుకుంటుందని రైతులు ఈ పంట సాగుపై 'మమకారం' ప్రదర్శిస్తు వస్తున్నారు. రైతుల అమాయకత్వమే వ్యాపారులకు పెట్టుబడిగా మారుతోంది. అక్రమాలకు అలవాటు పడిన వ్యాపారులు, దళారులు...ఇదే అదనుగా అనుమతిలేని 'బీటీ-3' విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. ఈ విత్తనాలను వేస్తే 'బీటీ-2' కంటే తెగుళ్లను సమర్థంగా ఎదుర్కోవడమే కాకుండా కలుపు ఉండదని.. దీని ద్వారా అధిక దిగుబడులు వస్తాయని నమ్మబలుకుతున్నారు. పంటల సాగులో కలుపు నివారణకు కూలీలు సకాలంలో దొరక్క ప్రతి ఏటా భారీఎత్తున నష్టాలు అంటూ వ్యాపారుల ప్రచారానికి ఆకర్షితులవుతున్నారు. బీటీ-2 విత్తన ప్యాకెట్ ధర ప్రస్తుతం రూ. 901 కానీ.. బీటీ-3 అనుమతిలేని విత్తనాలను ఇందుకు రెట్టింపు, అంతకంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. గతేడాది జిల్లాలో 1.04లక్షల పైచిలుకు ఎకరాల్లో పత్తి సాగులోకి వస్తే ఇందులో 20శాతానికిపైగా 'బీటీ-3'వేసినట్లు అంచనా. క్యాన్సర్ కారకమే కాకుండా నేలలకు అతి ప్రమాదకారిగా బీటీ-3 విత్తనాన్ని పరిగణిస్తారు. అయినా ఈ విత్తనం ఏటా విక్రయాలకు అడ్డుకట్ట పడటం లేదు.

పలహారానికి ప్రభుత్వ భూములు

- పథకం ప్రకారం సర్కారు భూములకు ఎసరు
- కబ్జాదారులకు వంతపాడుతున్న అధికారులు
- అమీన్‌పూర్ మున్సిపల్ అధికారుల అవినీతి బాగోతాల కథలెన్నో



అమీన్‌పూర్ మున్సిపాలిటీ

పటాన్ చెరు: అమీన్‌పూర్‌లో దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా సర్కారు భూమి ఉంది. ఆ భూమిని కాజేసేందుకు కొన్నేళ్లుగా కబ్జాకోరులు ఎత్తులు వేస్తూనే ఉన్నారు. రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగిపోయిన వీరు తాజాగా అధికారులతో కలసి మరింత జోరుగా ప్రభుత్వ భూమిని కొట్టేసేందుకు కుట్ర పన్నారు. ఈ కొత్త నాటకానికి సూత్రధారులు పాత్ర ధారుల తోడై కోట్లాది రూపాయల అవినీతికి తెర లేపారు. పట్టా భూమిలోని ప్లాట్లకు అనుమతులు తీసుకుని సర్కారు భూముల్లో పాగా వేసే ఎత్తుకు అమీన్‌పూర్ మున్సిపల్ అధికారులు వంత పాడుతున్నారు.

కబ్జాకు గురైన సర్కార్ భూమి

సర్వే నంబర్ 993లో మున్సిపల్ అధికారులు అనుమతివ్వడంతో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. వెయ్యి గజాల భూమిలో మున్సిపల్ అనుమతులు తీసుకుని ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ వ్యవహారంపై అమీన్‌పూర్ తాజా మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహగౌడ్, తాజా మాజీ కౌన్సిలర్ రమేశ్ ఇటీవల వ్యవహారంపై స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ప్రతీ చోటా ఇదే తీరు...

అమీన్‌పూర్ పట్టణంలో ఇది ఒకటే కాకుండా ప్రతీచోట ఈ పద్ధతిలోనే ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారు. పట్టా భూముల్లోనే ప్లాట్లను చూపుతూ ప్రభుత్వ భూముల్లో పాగా వేస్తున్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం తమకే సంబంధం లేదని అనుమతులిచ్చేసి చేతులు దులుపుకుంటున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనని టౌన్ ప్లానింగ్ అధికారులు వాదిస్తున్నారు. తమ కంప్యూటర్ సిస్టం ప్రకారం అనుమతికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నిబంధనలు మేరకున్న వాటికే అనుమతులు ఇస్తున్నామని చెప్తున్నారు. కానీ దరఖాస్తు దారులు ఇచ్చే మామూళ్లకు తలవంచి మున్సిపల్ అధికారులు ఇష్టానుసారంగా అడ్డగోలు అనుమతులిస్తున్నారని స్థానిక తాజా మాజీ కౌన్సిలర్లు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.

తోటలో ప్లాట్లు

సర్వే నంబర్ 1118లో ఇటీవల రెండు ఇళ్లకు అనుమతులిచ్చారు. వాస్తవానికి ఇది ఓ మామిడి తోట. ఆ తోటకు ఎలాంటి రోడ్డు లేదు. డ్రైనేజీ నిర్మించ లేదు. లే అవుట్ వేయలేదు. ఆ భూమి కోర్టు పరిధిలో ఉందని ఇతర అనేక ఆరోపణలున్నాయి. కానీ అధికారులు మాత్రం అక్రమ పద్ధతిలో ప్లాట్లు వేసేందుకు అనుమతులు జారీ చేశారు.

నర్రెగూడెంలో..

అమీన్పూర్ పరిధిలోని నర్రెగూడెంలో ప్రభుత్వ భూమిలో నాలుగు ఇళ్లకు అనుమతులు జారీచేశారు. ఒక తాజా మాజీ బీఆర్ఎస్ కౌన్సిలర్ పైరవీ చేసి అనుమతులను పొందారు. అలాగే 1056 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిలో వివాదాస్పద వాల నారాయణరావు ప్లాట్‌లకు అనుమతులు జారీ చేశారు. అక్కడ ఇసుకబావికి చెందిన ఒక తాజా మాజీ కౌన్సిలర్ భర్త కాల్వ భూమిలో ఓ తాత్కాలిక షెడ్డు వేశారు.

సస్పెండ్ చేయాలి

అమీన్‌పూర్ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల నష్టం జరుగుతోంది. ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుంది. అనుమతులు లేకుండా తాత్కాలిక షెడ్లను వేస్తున్నా పట్టించుకోవడం లేదు. కొత్తగా విలీనమైన గ్రామాల్లో పంచాయతీ అనుమతులతో బహుళ అంతస్తుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మున్సిపల్ అధికారుల అవినీతి కారణంగా అమీన్‌పూర్ పట్టణంలో అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదు. అవినీతి అక్రమ కార్యకలాపాలను అడ్డుకోవాల్సిన అధికారులు స్థానిక రాజకీయ నాయకులతో కలిసి ఇష్టానుసారం అనుమతులు ఇస్తున్నారు. వారిని సస్పెండ్ చేయాలి.

-నాయిని నరసింహారెడ్డి
సీఐటీయూ జిల్లా నాయకుడు

నిబంధనల మేరకే అనుమతులు

నిబంధనల మేరకే అనుమతులను జారీ చేస్తున్నాం. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడం లేదు. అన్నింటిపై చర్యలు తీసుకుంటాం.

-పవన్, టౌన్ ప్లానింగ్ అధికారి, అమీన్‌పూర్

కేంద్రానివి ప్రజావ్యతిరేక విధానాలు

- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్
- 20న దేశవ్యాప్త సమ్మెకు సంపూర్ణ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న మానిక్

సంగారెడ్డి రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తోన్న కార్మిక ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్ పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని, అది ప్రసాదించిన హక్కులను పరిరక్షించుకునేందుకు ప్రజలు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్లో సంఘం జిల్లా కార్యదర్శి పి.అశోక్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తుందని విమర్శించారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాలతో 100 సంవత్సరాల్లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందని మండిపడ్డారు. మే 20న దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు చేపట్టే సమ్మెకు సంఘీభావంగా సామాజిక తరగతులు దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనార్టీలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిత్య నైవేద్యానికి ఆర్థిక సాయం

- ధూప, దీప నైవేద్యానికి దరఖాస్తులు ఆహ్వానించిన ప్రభుత్వం
- ఈ నెల 24 వరకు స్వీకరణ
- ఇప్పటివరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో 939 ఆలయాలు ఎంపిక
- ఎంపికైన ఆలయానికి రూ.10 వేలు



సంగారెడ్డిలోని దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయం

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగానే పురాతన ఆలయాలతోపాటు నూతనంగా నిర్మించిన ఆలయాలలో నిత్య పూజా కార్యక్రమాలు కొనసాగే విధంగా చర్యలు చేపట్టింది. అందులోభాగంగానే కొన్నేళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వాలు ధూప, దీప, నైవేద్యం (డీడీఎన్) పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ అమలు చేస్తుంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది.

నిత్య పూజాది,నైవేద్య కార్యక్రమాలు జరగాలని..

గ్రామాలలోని ప్రతి ఆలయంలో నిత్య పూజా కార్యక్రమాలుతోపాటు నైవేద్య సమర్పణ జరగాలని ప్రధాన ఉద్దేశంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డా.రాజశేఖర్ రెడ్డి 2007లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. అప్పట్లో ఈ పథకం కింద రూ.2,500 మంజూరు చేసేవారు. అనంతరం ఏర్పాటైన అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ.10వేలకు పెంచింది. డీడీఎస్ పథకంలో ఎంపికైన ఆలయానికి లభించే రూ.10 వేలలో రూ.4వేలు ధూప, దీప నైవేద్యానికి, రూ.6వేలు ఆలయంలో పూజలు చేసే అర్చకుడికి గౌరవ వేతనంగా అందిస్తున్నారు. ధూప, దీప, నైవేద్య పథకానికి సుమారు మూడేళ్ల తర్వాత ఆలయాల ఎంపికకు నోటిఫికేషన్ విడుదల చేసింది. విడుదల చేసిన నోటిఫికేషన్ల ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లాలో 939 ఆలయాలను ఈ పథకానికి ఎంపిక చేశారు.

43 సెక్షన్ ద్వారా రిజిస్ట్రేషన్ తప్పనిసరి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డీడీఎస్ పథకానికి దేవాదాయ ధర్మదాయ శాఖ చట్టం ప్రకారం 43సెక్షన్ ద్వారా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ అయి ఉండాలని నిబంధన ఉంది. అదేవిధంగా పథకానికి దరఖాస్తు చేసుకునేవారు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో విధులు నిర్వహించకుండా ఉండాలి. ముఖ్యంగా పురాతన ఆలయాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పథకం కోసం దరఖాస్తు చేసుకునే ఆలయం ఎటువంటి ఆస్తులతో పాటు ఆదాయాలు కలిగి ఉండకూడదని నిబంధన ఉంది. నిర్దేశిత సమయంలో దరఖాస్తు చేసుకుని, దేవాదాయ ధర్మదాయ సహాయ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో పత్రాలను అందించాలి.

ఆలయాల ఎంపికకు కమిటీ

పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వాటిని ఎంపిక చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నారు. కమిటీలో జిల్లా అదనపు కలెక్టర్, అసిస్టెంట్ కమిషనర్ (దేవాదాయశాఖ), తహసీల్దార్ తోపాటు ప్రముఖ పూజారి ఉండనున్నారు. వీరి విచారణ అనంతరం రెండవ దశలో మరో ప్రత్యేక కమిటీ పరిశీలించనున్నారు.

ఉమ్మడి మెదక్‌లో ధూప, దీప నైవేద్యం పథకానికి ఇప్పటివరకు మంజూరైన ఆలయాలు

దశ	మెదక్	సంగారెడ్డి	సిద్దిపేట
మొదటి	43	31	144
రెండవ	43	91	142
మూడవ	93	181	171
మొత్తం	179	303	457

అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ధూప దీప నైవేద్య పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 24 వరకు దరఖాస్తు చేసుకోవాలి. ఆలయానికి ఎలాంటి ఆదాయాలు, ఆస్తులు లేకుండా ఉండి, రిజిస్టర్ అయి తప్పనిసరిగా ఉండాలి. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో పర్యటించి నిబంధనల ప్రకారం ఎంపిక చేస్తారు.

-చంద్రశేఖర్, అసిస్టెంట్ కమిషనర్ దేవాదాయ ధర్మదాయ శాఖ, ఉమ్మడి మెదక్ జిల్లా

క్లుప్తంగా

పిడుగుపాటుకు గేదెలు మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): పిడుగు పాటుకు పాడి గేదెలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మెట్‌పల్లిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బొస్సే చంద్రం రోజు మాదిరిగా పాడి గేదెలను వ్యవసాయ పొలం వద్ద కట్టేసి ఇంటికొచ్చాడు. మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా రెండు గేదెలు మృతి చెంది ఉన్నాయి. విషయం తెలుసుకున్న పశువైద్యురాలు మంజుల అక్కడకు చేరుకొని పరిశీలించి పిడుగుపాటుతోనే మృతి చెందినట్లు నిర్ధారించారు. సుమారు రూ.లక్ష విలువైన పాడి గేదెలు మృతి చెందడంతో రైతు బోరున విలపించాడు. మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

విద్యుదాఘాతంతో మేకలు..

తొగుట(దుబ్బాక): విద్యుదాఘాతంతో మేకలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని లింగంపేటలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. తొగుట మండల కేంద్రానికి చెందిన ముచ్చర్ల రమేష్ మేకలను పెంచుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ మాదిరిగా ఉదయం మేతకు తీసుకెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికొస్తున్నాడు. లింగంపేట శివారులో పటేల్ చెరువు వద్ద ఆదివారం ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఆ స్తంభాలకు కరెంట్ సరఫరా అవుతుంది. నీరు తాగేందుకు చెరువులోకి వెళ్తున్న క్రమంలో వైర్లకు తగిలి మూడు మేకలు మృతి చెందాయి. వాటి విలువ రూ.60 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గ్రామస్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రతీయేటా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ అన్నారు. మంగళవారం తెల్లాపూర్ గద్దర్ సర్కిల్ వద్ద అమృత, సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్రతీయేటా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. మూడు రోజుల పాటు జరిగే కబడ్డీ పోటీల్లో 31 జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఇందులో మొదటి విజేతకు రూ.99,999, రెండో బహుమతి రూ.55,555, మూడో బహుమతి రూ. 33,333 నగదు అందించనున్నట్లు తెలిపారు.

పెట్టుబడి పేరుతో వ్యాపారి మోసం

రూ.1.74 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

దుబ్బాక : పెట్టిన పెట్టుబడికి తక్కువ కాలంలో రెట్టింపు డబ్బులు వస్తాయంటూ సైబర్ మోసగాళ్లు చెప్పిన మాటలు నమ్మి ఓ వ్యాపారి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన దుబ్బాక పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక పట్టణానికి చెందిన మహమ్మద్ సలాం అనే వ్యాపారి సెల్‌ఫోన్‌కు గతేడాది అక్టోబర్‌లో అమీలియా అనే గ్రూపునకు సంబంధించి లింక్ వచ్చింది. దానిని క్లిక్ చేయగా డబ్బులు పెట్టుబడి పెడితే తక్కువ కాలంలో రెట్టింపు డబ్బులు వస్తాయన్న వివరాలు ఉన్నాయి. సలాం దానిలో ఉన్న స్కానర్‌కు మొదట రూ.30 వేలు పంపగా వెంటనే రూ.60 వేలు వచ్చాయి. మరోసారి మళ్లీ రూ.30 వేలు పంపగా అలాగే వచ్చాయి. దీంతో అత్యాశతో రూ.1,74,999 ను ఆ లింక్‌లోని స్కానర్‌కు విడతల వారీగా పంపాడు. అప్పటి నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో మోసపోయాయని గుర్తించాడు. ఈ విషయాన్ని బాధితుడు 1930 కి కాల్‌చేసి ఫిర్యాదు చేయడంతో రూ.7 వేలు ఫ్రీజ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫలితాల్లో రోల్ మోడల్

పదేళ్లుగా పదిలో 100 శాతం ఉత్తీర్ణత
- ఆటల్లోనూ రాణిస్తున్న విద్యార్థులు
- ఆదర్శంగా నిలుస్తున్న టేక్మాల్ మోడల్ స్కూల్
- ఆరవ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఆంగ్లంలోనే విద్యా బోధన
- 20 వరకు ఇంటర్‌లో దరఖాస్తులకు అవకాశం

శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీ బానిస అవుతుందన్న నానుడి నిజం చేస్తున్నారు టేక్మాల్ మోడల్ స్కూల్ విద్యార్థులు. విద్యాబోధనలో మెళకువలు పాటిస్తూ.. ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలుస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపడుతూ విద్యావ్యవస్థలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్న తలంపుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్ మంచి ఫలితాలను సాధిస్తూ శభాష్ అనిపించుకుంటుంది.

–టేక్మాల్(మెదక్)


టేక్మాల్ మోడల్ స్కూల్

జిల్లాలో 7 ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయగా ఒక్కో పాఠశాలకు సుమారుగా 820 మంది విద్యార్థులు విద్యాబోధన చేస్తున్నారు. ఆరవ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఆంగ్లంలోనే విద్యా బోధన నిర్వహిస్తున్నారు. జిల్లా అన్ని ప్రభుత్వ, మోడల్ స్కూల్ కంటే టేక్మాల్‌లోని మోడల్ స్కూల్‌లో మంచి ఫలితాలను సాధిస్తూ జిల్లాలోనే టాప్‌లో నిలుస్తున్నారు.

ఉత్తమ ఫలితాల్లో ఫస్ట్..

- క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తూ పాఠశాలలో పదవ తరగతి ప్రారంభమైన 2016 నుంచి పదవ తరగతిలో ఈ ఏడాది వరకు 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు.
- ఈసారి పదవ తరగతిలో శ్రీజ 577 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, కార్తీక్ 572 మార్కులను సాధించి రెండో స్థానంలో నిలిచాడు. సుమారు 44 మందికి విద్యార్థులు 500లకి పైగా మార్కులు సాధించారు.
- ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో 87 శాతం ఉత్తీర్ణత సాధించగా పాఠశాలకు చెందిన పూజ అనే విద్యార్థి 960 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది.
- పాఠశాలలో నేషనల్ మిన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు పదులకొద్ది విద్యార్థులు ఎంపికవుతున్నారు.
- ముఖ్యంగా ప్రభుత్వ పరిధిలో ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో మోడల్ స్కూల్ అన్నింటి కంటే ఆదర్శంగా నిలుస్తోంది.
- ఇక్కడ చదువుతున్న విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో సైతం పట్టు సాధించి ఉన్నత విద్యకు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని పొందుతున్నారు.

ఇంటర్‌లో దరఖాస్తుల ఆహ్వానం

- 2025–26 సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.
- ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మొత్తంగా 150 సీట్లు అందుబాటులో ఉండగా పదవ తరగతి వచ్చిన మార్కుల మెరిట్ లిస్టు ప్రకారం విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో అవకాశం కల్పిస్తారు. ప్రస్తుతం మోడల్ స్కూల్లో ఎంపీసీ 40, బైపీసీ 40, సీఈసీ 40, ఎంఈసీ 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- మొదటి సంవత్సరం ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. 20వ తేదీ వరకు గడువు కావడంతో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. మోడల్ స్కూల్‌లో 100 మంది విద్యార్థినులకు ఉచిత వసతి కల్పించడం జరుగుతుందని తెలిపారు.

సమష్టి కృషితో ఫలితాలు



కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యాబోధన నిర్వహిస్తున్నాం. పదేళ్లుగా పదవ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాం. ఇంటర్మీడియట్‌లో సైతం మంచి ఫలితాలు సాధిస్తున్నాం. పాఠశాలలోని ఉపాధ్యాయుల అందరి సమష్టి కృషితో ప్రతీ ఏడాది మంచి ఫలితాలను సాధిస్తున్నాం. చదువుతోపాటు విద్యార్థులు ఆటల్లో తమ ప్రతిభను కనబర్చి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకొస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ కార్యక్రమం నిర్వహిస్తాం.

– సుంకరి సాయిలు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, టేక్మాల్



ఆటల్లోనూ అదుర్స్..

చదువుతోపాటూ పాఠశాలల్లోని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ, ఆటల్లోనూ తమ ప్రతిభ కనభరుస్తున్నారు. మండల స్థాయిని మొదలుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను కనబరుస్తున్నారు. యోగాలో తమకు దీటుగా ఎవరూ లేరంటూ జాతీయ స్థాయిలో బహుమతులు పొంది అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు. వసతులు అంతత మాత్రమే ఉన్నప్పటికీ క్రమశిక్షణతో కూడిన విద్యా బోధన ఉండటంతో పాఠశాలల్లో చేరేందుకు డిమాండ్ ఉంది.

అనారోగ్యం తట్టుకోలేక ఉరేసుకొని ఆత్మహత్య


శ్రీనివాస్ (ఫైల్)

హుస్నాబాద్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హుస్నాబాద్ పట్టణంలోని హనుమాన్ నగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. హనుమాన్ నగర్‌కు చెందిన గొర్ల శ్రీనివాస్ (40)కు భార్య లక్ష్మీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో ఒక అమ్మాయికి వివాహం జరిగింది. శ్రీనివాస్ కొద్ది రోజులుగా కిడ్నీ వ్యాధితోపాటు అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. భార్య కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. అనారోగ్య సమస్యలతో వేగలేక మనస్తాపం చెందిన శ్రీనివాస్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది..

గజ్వేల్‌రూరల్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గజ్వేల్ పట్టణంలో మంగళవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. రాయపోల్ మండలం తిమ్మకపల్లికి చెందిన కామోజీ ఆంజనేయులు(45)కు నవనీతతో 14 ఏళ్ల కిందట వివాహం కాగా వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెయింటర్‌గా పని చేస్తున్న ఆంజనేయులు గజ్వేల్ పట్టణంలోని ఓ ఇంట్లో అద్దె కుంటున్నాడు. మద్యానికి బానిసై భార్యతో తరచూ గొడవ పడుతుండటంతో పిల్లలను తీసుకొని తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెంది ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆంజనేయులు గది నుంచి దుర్వాసన వస్తుండడంతో ఇంటి యజమాని వచ్చి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే మృతుడి కుటుంబ సభ్యులకు విషయం చెప్పాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు 4న ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విచక్షణ రహిత జర్నలిజాన్ని ప్రోత్సహించొద్దు

సీనియర్ సంపాదకులు కే. శ్రీనివాస్



మాట్లాడుతున్న సీనియర్ సంపాదకులు శ్రీనివాస్

ములుగు(గజ్వేల్) : సోషల్ మీడియాలో జవాబుదారీతనం లేకపోవడంతో విచ్చలవిడితనం పెరిగిపోయిందని, రాజకీయ నాయకులు విచక్షణ రహిత జర్నలిజాన్ని ప్రోత్సహించొద్దని సీనియర్ సంపాదకులు, రచయిత కే. శ్రీనివాస్ పేర్కొన్నారు. గజ్వేల్ ప్రెస్‌క్లబ్ 25 ఏళ్ల వేడుకల(రజతోత్సవాలు) సందర్భంగా ములుగులోని ఓ ఫంక్షన్ హాల్‌లో 'జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్' అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు కే.విరాహత్ అలీతో కలిసి మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంలో ప్రింట్ జర్నలిజంలో వడపోత ప్రక్రియ ఉండేదని, ప్రస్తుతం ఎవరికి నచ్చినట్లు వారు ఏది పడితే అది మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కే. విరాహత్ అలీ మాట్లాడుతూ.. అక్షరజ్ఞానం లేనివారు, అల్లరి మూకలు మీడియా పేరు చెప్పుకొని ఇష్టారీతిన బ్లాక్ మైలింగ్‌కు పాల్పడుతున్న విషయాలు తమ దృష్టికి వచ్చాయని, ఇలాంటి వారికి ప్రజా కోర్టులోనే గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి, ఎల్లం, టీ. నర్సింలు, జగదీశ్వర్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ విజయమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): ఐపీఎల్ బెట్టింగ్ ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తెలిపారు. మంగళవారం స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఎల్.శ్రీను వివరాలు వెల్లడించారు. పట్టణ పరిధిలోని చెరువు సమీపంలో కొందరు వ్యక్తులు ఐపీఎల్ బెట్టింగ్ ఆడుతున్నట్లు సమాచారం అందింది. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చేర్యాల పోలీసులు వెళ్లి దాడి చేసి కమల్ల శ్రీనివాస్, కూరపాటి శివప్రసాద్, నర్ర చంద్రబాబు, ఎల్ల నవీన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.76,400 నగదు, 4 మొబైల్ ఫోన్లు, 3 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. మరికొంత మంది పారిపోయారని, త్వరలోనే వారిని పట్టుకుంటామన్నారు. సమావేశంలో చేర్యాల ప్రొబిషనరీ ఎస్‌ఐ సమత, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు తాగి

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి

నిజాంపేట(మెదక్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన నిజాంపేట మండల వెంకటపూర్ (కె) తండాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తండాలోని బానోత్ దేవోజ్, భారతీ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కుటుంబ సమస్యల కారణంగా గత నెల 29న బానోత్ భారతీ (40) పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే నార్సింగ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందింది.

ముగ్గురి పైకి దూసుకెళ్లిన కారు

మహిళ మృతి, మరో ఇద్దరికి గాయాలు


మారవ్వ(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): వల్లభాపూర్‌లో కారు బీభత్సం సృష్టించింది. రోడ్డు దాటుతున్న ముగ్గురి పైకి దూసుకెళ్లడంతో మహిళ మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నార్సింగి పరిధిలోని వల్లభాపూర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు పోచమ్మల మారవ్వ(58), రామయ్యతోపాటు చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన దశరథం పని మీద రామాయంపేటకు వెళ్లి తిరిగి ఇంటికొస్తున్నారు. వల్లభాపూర్ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా కామారెడ్డి వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను రామాయంపేట ప్రభుత్వ తరలిస్తుండగా మారవ్వ మృతి చెందింది. నార్సింగి పోలీస్‌లు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అధిక దిగుబడులు సాధించాలి

సీడీసీ చైర్మన్ రాంరెడ్డి


మాట్లాడుతున్న సీడీసీ చైర్మన్ రాంరెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వ్యవసాయరంగంలో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందాలని సీడీసీ చైర్మన్ రాంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆత్మకూర్ రైతువేదికలో జరిగిన 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' కార్యక్రయానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శాస్త్రవేత్తల సూచనల మేరకు తక్కువ మోతాదులో రసాయన ఎరువులు, పురుగు మందులను వినియోగించాలన్నారు. సాగునీటిని ఆదా చేసి భవిష్యత్ తరాలకు అందించడం మన అందరి బాధ్యత అన్నారు. పంట మార్పిడిని పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందాలని సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయ్‌కుమార్, విజయలక్ష్మి, గణపతి షుగర్ పరిశ్రమ జనరల్ మేనేజర్ కృష్ణ మోహన్, ఏఓ రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్ధన్న, మాజీ సర్పంచ్ గంగన్న, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

జహీరాబాద్: కోహీర్ మండలంలోని చింతలగట్టు గ్రామంలో దుర్గామాత, ఊరడమ్మ మాతల విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన వేడుకల్లో సెట్విల్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, ఎస్.ఉజ్వల్‌రెడ్డిలు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ముబీన్, కాంగ్రెస్ పార్టీ ఆయా మండలాల అధ్యక్షులు రామలింగారెడ్డి, పి.నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లన్న పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో చెరువు నిర్మించాలి

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో చెరువును నిర్మించాలని తెలంగాణ జేఏసీ జిల్లా చైర్మన్ ఖాజామియా కోరారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో చెరువు, కుంట లేదని తెలిపారు. చెరువు నిర్మిస్తే బీడుభూములు సాగులోకి రావడంతో పాటు పశుపక్ష్యాదులకు తాగునీరు లభిస్తుందన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటికి ఆటంకాలు ఏర్పడిన సమయాల్లో ప్రత్యామ్నాయంగా చెరువు నీటిని శుద్ధి చేయించి తాగు నీటిగా సరఫరాకు అవకాశం ఉంటుందన్నారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి చెరువు నిర్మాణానికి చొరవ చూపి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- సిద్దిపేట సీపీ అనురాధ
- హోంగార్డు సిబ్బందితో 'దర్బార్'


మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: యూనిఫామ్ వేసుకున్న ప్రతీ ఒక్కరికి క్రమశిక్షణ ముఖ్యమని యూనిఫామ్‌లో ఉన్న వారిని పది మంది గమనిస్తూ ఉంటారని అది తెలుసుకొని బాధ్యతగా విధులు నిర్వహించాలని సీపీ సూచించారు. సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయంలో హోంగార్డు సిబ్బందికి దర్బార్ నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. హోంగార్డ్స్ పోలీసు శాఖలో అంతర్గత భాగమే అన్నారు. హోంగార్డుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. ప్రతీ మూడు నెలలకోసారి దర్బార్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ పీఎస్‌లో పోలీసు సిబ్బందితో పాటు విధులు నిర్వహిస్తున్నారని, క్లిష్ట పరిస్థితుల్లో బందోబస్తు విధుల్లో చాలా సమర్థవంతంగా విధులు నిర్వహించారని ఇక ముందు కూడా అదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ధరణి కుమార్, కార్తీక్, విష్ణుప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీస్‌లపై దాడి

మద్దూరు(హుస్నాబాద్): నాటుసారా తయారీపై తనిఖీకి వెళ్లిన ఎక్సైజ్ ఎస్‌ఐపై ఓ వ్యక్తి దాడి చేసి గాయపర్చాడు. ఈ ఘటన దూళ్మిట్ట మండలం దుబ్బతండా గ్రామ పంచాయతీ పరిధిలోని చెలిమితండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ షేక్ మహబూబ్ కథనం మేరకు.. చెలిమితండాలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు చేర్యాల ఎక్సైజ్ ఎస్‌ఐ గుగులోతు సువర్ణ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ ఫరీద్, కానిస్టేబుల్ రవి, శ్రీలత, నర్సింహులుతో కలిసి ప్రభుత్వ వాహనంలో తనిఖీలకు వెళ్లారు. తండాకు చెందిన పీర్యా ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తుండగా పక్క ఇంటిలో ఉన్న ముడావత్ సంతోష్ అనే వ్యక్తి ఎక్సైజ్ ఎస్‌ఐ, సిబ్బందిని దుర్భాషలాడుతూ సమీపంలో ఉన్న రాయిని తీసుకొని పైకి వచ్చినట్లు తెలిపారు. గ్రామస్తులు వారించగా తిరిగి ఇటుకతో విసిరిగొట్టగా ఎక్సైజ్ ఎస్‌ఐ సువర్ణ చేతికి గాయమైంది. తమ విధులకు ఆటంకం కలిగించి తనపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ ఎస్‌ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతోష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు షేక్ మహబూబ్ తెలిపారు.

పశువైద్యం.. దైవాదీనం!

మూగజీవాలకు అందని వైద్యం
- రెండు మండలాలకు ఒకటే ఆస్పత్రి
- సొంత భవనాలు కరువు
- చేర్యాల పట్టణ కేంద్రంలో బడిలో కొనసాగింపు
- ఆకునూరు ఆస్పత్రికి భవనం లేక నోచుకోని ఏర్పాటు
- భవనాలు నిర్మించాలని కోరుతున్న రైతులు


ప్రభుత్వ బడిలో నిర్వహిస్తున్న పశువైద్యశాల

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పట్టణంలో మూగజీవాలకు పశువైద్యం అందని ద్రాక్షలా మారుతోంది. పట్టణ కేంద్రంలో పశువులకు వైద్యం అందించే పశువైద్యశాలను కొన్నేళ్ల కిందట కూల్చి వేశారు. అనంతరం కొద్దిరోజులు స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఆస్పత్రి నిర్వహించారు. అనంతరం సిద్దిపేట జనగామ ప్రధాన రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోకి మార్చారు.

చేర్యాల మండల వ్యాప్తంగా ఒక్కటే..

పట్టణ కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో గేదెలు 2,935, ఆవులు, ఎడ్లు 1,347, మేకలు 9,865, గొర్రెలు 25,354 ఉన్నాయి. ఉమ్మడి చేర్యాల మండల పశు వైద్యశాల గతంలో మద్దిముస్త్యాలలో ఉండేది. రైతులు పశు వైద్య సేవల నిమిత్తం అక్కడికి వెళ్లేవారు. 2016లో జరిగిన జిల్లా విభజన సమయంలో చేర్యాల మండలం కొమురవెల్లి, చేర్యాల రెండుగా విభజించబడింది. ఈ క్రమంలో చేర్యాల మండల పశు వైద్యశాలను ఆకునూరులో ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కానీ అక్కడ ఎలాంటి భవనం లేకపోవడంతో ఏర్పాటు చేయలేదు. మద్దిముస్త్యాల గ్రామం కొమురవెల్లి మండల పరిధిలోకి వెళ్లడంతో అక్కడి రైతులు పశువులకు వైద్యం అందించడానికి మద్దిముస్త్యాలకు వస్తున్నారు. చేర్యాల మండల వ్యాప్తంగా ఒక్కటే పశు వైద్యశాల ఉండటంతో ఇక్కడి రైతులు కూడా మద్దిముస్త్యాలకు వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే మండల పరిధిలోని ఆకునూరు, పట్టణ కేంద్రంలోని పశు వైద్యశాలలకు సొంత భవనాలు నిర్మించి అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

నిధులున్నా ఆగిన భవనం

ఇది ఇలా ఉంటే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేర్యాలలోని స్థానిక అంగడి బజారులో ఉన్న పశు వైద్యశాల భవనాన్ని కూల్చి వేశారు. అప్పటి ప్రభుత్వం కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, స్థలం సేకరణ కూడా చేసింది. కొన్ని అనివార్య కారణాలతో భవన నిర్మాణం చేయలేదు. దీంతో వైద్య అధికారులు చేసేది ఏమి లేక వేర్వేరు భవనాల్లో ఆస్పత్రి నడిపిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. చేర్యాలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలలో కొనసాగిస్తున్నారు. ఆకునూరుకు సంబంధించి కనీసం అద్దె భవనం కూడా దొరక్క ఏర్పాటు చేయలేదు.

బడిలో కొనసాగిస్తున్నాం



పట్టణ కేంద్రంలో సొంత భవనం లేకపోవడంతో మూతబడ్డ బడిలో వైద్య సేవలు అందిస్తున్నాం. పాత భవనాన్ని కూల్చి వేసిన అనంతరం లయన్స్‌క్లబ్ భవనంలో ఉండేది. వారు ఖాళీ చేయాలని చెప్పడంతో కలెక్టర్ అనుమతితో మూతబడ్డ బడిలోకి మార్చాం. గతంలో నిధులు మంజూరు చేసినా ప్రభుత్వం కొన్ని కారణాలతో నిర్మాణం చేయలేదు.

–రాజిరెడ్డి, పశు వైద్యశాఖ ఏడీ

భవనం కేటాయించాలి



మండలాల విభజన సందర్భంగా చేర్యాల మండల పశు వైద్య శాలను ఆకునూరులో ఏర్పాటు చేసేలా నిర్ణయించారు. అక్కడ ఎలాంటి భవనం కేటాయించకపోవడంతో ప్రస్తుతం కొమురవెల్లి మండలం మద్దిముస్త్యాల, చేర్యాల పట్టణ కేంద్రంలోని ఆస్పత్రి నుంచి సేవలు అందిస్తున్నాను. భవనం కేటాయిస్తే ఆకునూరులో వైద్య సేవలు ప్రారంభిస్తాం.

–విజయసారథి, మండల పశువైద్యాధికారి

మద్దిముస్త్యాలకు వెళ్లలేక పోతున్నాం



గతంలో మండల పశువైద్యశాల మద్దిముస్త్యాలలో ఉండేది. ఏదైనా మందులు అవసరం ఉంటే అక్కడికి వెళ్లి తెచ్చుకునే వాళ్లం. మండలం విడిపోయాక ఆకునూరుకు మార్చారు. కానీ అక్కడ ఆస్పత్రి లేదు. అలాగే పట్టణ కేంద్రంలోని ఆస్పత్రి కూల్చివేశారు. ప్రభుత్వ బడిలో నిర్వహిస్తున్నారు. ఇప్పుడు కూడా మద్దిముస్త్యాలకు వెళ్లాలంటే రైతులకు ఇబ్బంది అవుతుంది.

–భాస్కర్‌రెడ్డి, రైతు